ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.40 (122.3596)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.60 (2.69)	197	78.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.29 (0.38)	నిల్	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.168 | డ్రెస్ : రూ.260 | స్కిన్‌లెస్ : రూ.290

మద్దతు తక్కువే



- పంటల మద్దతు ధరలను ప్రకటించిన కేంద్రం
- గత ఏడాదితో పోల్చితే పెంపు తక్కువే
- వరికి రూ.117, పత్తికి రూ.501
- కందికి రూ.550, నువ్వులకు రూ.632 పెంపు

మోత్కూరు, జూన్ 20: కేంద్ర ప్రభుత్వం పంటలకు మద్దతు ధర ప్రకటించింది. ఏటా సాగు ఖర్చు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర పెంపు గత ఏడాదితో పోల్చితే ఈ సారి తగ్గింది. సాగు వ్యయం మాత్రం గత ఏడాదితో పోల్చితే పెరిగింది. గత ఏడాది వరికి రూ.143, పత్తికి రూ.540, కందికి రూ.400, నువ్వులకు రూ.805, పెసర రూ.803పై మద్దతు ధర పెంచగా, ఈ ఏడాది వరికి రూ.117, పత్తికి రూ.501, కందికి రూ.550, నువ్వులకు రూ.632, పెసరకు రూ.124 మాత్రమే పెంచారు. గత ఏడాది కంటే ఈ సారి కంది, రాగులు, పొద్దుతిరుగుడుకు కొంత ఎక్కువగా పెరిగింది. సన్న రకాల వరి ధాన్యానికి మాత్రం కేంద్రం మద్దతు ధర ప్రకటించలేదు.

ఎక్కువ సాగయ్యే పంటలపై తక్కువ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వరి, పత్తి అధికంగా సాగవుతోంది. కంది, వేరుశనగ, తదితర పంటలు చాలా తక్కువ విస్తీర్ణంలో సాగవుతాయి. నువ్వులు, పెసర, పొద్దుతిరుగుడు, మినుములు లాంటి పంటలు నామమాత్రంగా సాగవుతాయి. ఎక్కువగా సాగు చేసే పంటలకు మద్దతు ధర తక్కువగా పెంచి, నామమాత్రంగా సాగయ్యే పంటలకు కొంత ఎక్కువగా పెంచడంతో పెద్దగా లాభం ఉండదని రైతులు పేర్కొంటున్నారు.

పెరిగిన సాగు వ్యయం

గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది సాగు వ్యయం బాగా పెరిగింది. విత్తనాలు, ట్రాక్టర్ దున్నకం, ఫ్లౌ, కూలీల రేట్లు బాగా పెరిగాయి. వ్యవసాయ పంపుసెట్లు, ట్రాక్టర్ లాంటి వ్యవసాయ యంత్రాల ధరలు ఇబ్బడిమబ్బడిగా పెరిగాయి. ఇలా సాగు ఖర్చు పెరగడంతో కేంద్ర ప్రభుత్వం పెంచే మద్దతు ధరలు పెట్టుబడి ఖర్చుల పెరుగదలతో సరిపోలడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

సాగు వ్యయాన్ని తక్కువగా చూపుతున్న ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వం ఏటా పంటల మద్దతు ధరలు పెంచుతున్నా, పంటల సాగు వ్యయం అంతకంటే ఎక్కువ పెరుగుతోంది. పంట సాగు వ్యయానికి 50శాతం అదనంగా కలిపి మద్దతు ధర ప్రకటించాలని గతంలో స్వామినాథన్ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కాగా, కేంద్రం ప్రభుత్వం వాస్తవ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సాగు ఖర్చును తక్కువగా చూపి దానికి 50శాతం కలిపి మద్దతు ధర ప్రకటిస్తోందని పలువురు నిపుణులు విమర్శిస్తున్నారు.


గిట్టుబాటు కాని మద్దతు ధరలు

పత్తి సాగుకు ఎకరాకు సుమారు రూ.45వేల ఖర్చు వస్తోంది. ఎకరాకు ఆరు నుంచి ఏడు క్వింటాళ్ల పత్తి కంటే ఎక్కువ దిగుబడి రావడం లేదు. ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తి దిగుబడిని తీసుకుంటే క్వింటాకు రూ.7,521 చొప్పున రూ.52,647 వస్తాయి. అందులోంచి రూ.45వేలు పెట్టుబడి తీయగా రైతుకు మిగిలేది రూ.7,647. పత్తి ట్రాన్స్‌పోర్ట్‌కు క్వింటాలకు రూ.500 ఖర్చు వస్తోంది. సొంతంగా సాగు చేసుకునే రైతు అయితేనే ఈ మిగులుబాటు. అదే కౌలు రైతు అయితే అది కూడా మిగలదు. వరి సాగుకు ఎకరాకు సుమారు రూ.27వేలు ఖర్చవుతుంది. ఎకరాకు సగటున 23 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది. ప్రభుత్వానికి విక్రయించాలంటే మార్కెట్‌కు తరలించి ఆరబెట్టి, తూర్పార పడితే సుమారు మూడు క్వింటాళ్ల తరుగు వస్తుంది. ఇక 20 క్వింటాళ్లకు రూ.46,000 వస్తాయి. అంటే ఎకరాకు రూ.9వేలు మిగులుతాయి. అది కూడా సొంతంగా సాగుచేస్తేనే. ఎకరాకు రూ.10వేలు కౌలు ఉంది. ప్రైవేట్ వ్యాపారులు క్వింటాకు రూ.1,900 చెల్లిస్తున్నారు. దీంతో రైతుకు మిగులుబాటు ఉండటం లేదు.

పంటల మద్దతు మద్దతు ధర పెంపు ఇలా...

పంటరకం	2022లో	2023లో	పెంపు	2024లో	పెంపు
వరి (సాధారణం)	రూ.2,040	రూ.2,183	రూ.143	రూ.2,300	రూ.117
వరి (ఏ-గ్రేడ్)	రూ.2,060	రూ.2,203	రూ.143	రూ.2,320	రూ.117
పత్తి (మధ్యస్థ పింజ)	రూ.6,080	రూ.6,620	రూ.540	రూ.7,121	రూ.501
పత్తి (పొడవు పింజ)	రూ.6,380	రూ.7,020	రూ.640	రూ.7,521	రూ.501
కంది	రూ.6,600	రూ.7,000	రూ.400	రూ.7,550	రూ.550
పెసర	రూ.7,755	రూ.8,558	రూ.803	రూ.8,682	రూ.124
మినుములు	రూ.6,600	రూ.6,950	రూ.350	రూ.7,400	రూ.450
జొన్న (హైబ్రీడ్)	రూ.2,970	రూ.3,180	రూ.210	రూ.3,371	రూ.191
జొన్న (మాల్దండి)	రూ.2,990	రూ.3,225	రూ.235	రూ.3,421	రూ.196
సజ్జ	రూ.2,350	రూ.2,500	రూ.150	రూ.2,625	రూ.125
రాగులు	రూ.3,578	రూ.3,846	రూ.268	రూ.4,290	రూ.444
మొక్కజొన్న	రూ.1,962	రూ.2,090	రూ.128	రూ.2,225	రూ.135
వేరుశనగ	రూ.5,850	రూ.6,377	రూ.527	రూ.6,783	రూ.406
పొద్దుతిరుగుడు	రూ.6,400	రూ.6,760	రూ.360	రూ.7,280	రూ.520
సోయాబీన్	రూ.4,300	రూ.4,600	రూ.300	రూ.4,892	రూ.292
నువ్వులు	రూ.7,830	రూ.8,635	రూ.805	రూ.9,267	రూ.632

వరి, పత్తికి ఇంకా పెంచాలి



కేంద్ర ప్రభుత్వం పంటల మద్దతు ధర కొంత పెంచినా, అది గిట్టుబాటు కాదు. ఏటా సాగు ఖర్చులు పెరుగుతున్న తీరున ప్రభుత్వం మద్దతు ధర పెంచడం లేదు. వరికి క్వింటాకు కనీసం రూ.2600, పత్తికి రూ.9000 మద్దతు ధరగా నిర్ణయించాలి. అప్పుడే రైతుకు గిట్టుబాటు అవుతుంది. పంటల మద్దతు ధర ప్రకటించే ముందు ప్రభుత్వాలు రైతులతో గానీ, రైతు సంఘాల ప్రతినిధులతో గానీ చర్చించాలి.

● మర్రి మధు, రైతు, మోత్కూరు



పాలనను చేరువ చేసేందుకు

- జిల్లాలో రెండు డివిజన్లకు సబ్ కలెక్టర్లు
- ఐఏఎస్‌స్థాయి అధికారులను నియమించనున్న ప్రభుత్వం

మిర్యాలగూడ, దేవరకొండ, జూన్ 20: వరుస ఎన్నికల తరువాత పాలనపై ప్రభుత్వం దృష్టిసారించింది. ప్రభుత్వ పాలనను, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపేలా రెవెన్యూ డివిజన్లకు సబ్ కలెక్టర్ల నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. రాష్ట్రంలో మొత్తం 15 రెవెన్యూ డివిజన్లకు సబ్ కలెక్టర్లను నియమించనుండగా, జిల్లాలో మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లకు నూతన సబ్ కలెక్టర్లు రానున్నారు. సబ్ కలెక్టర్లుగా ఐఏఎస్ స్థాయి అధికారులను నియమించనుండటంతో సమస్యలకు సత్వరం పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు.

రెవెన్యూ డివిజన్లకు సబ్ కలెక్టర్లను నియమించడం కొత్తకాకపోయినా, పెద్ద మొత్తంలో ఐఏఎస్‌స్థాయి అధికారులను నియమించడం చర్చనీయాంశమైంది. గతంలోనూతన ఐఏఎస్ అధికారులను కలెక్టర్ పోస్టులో నేరుగా నియమించకుండా పాలనానుభవం కోసం అదనపు కలెక్టర్లుగా కొంతకాలం నియమించేవారు. వారికి పూర్తి శిక్షణ అనంతరం కలెక్టర్‌గా ప్రభుత్వం ఇతర జిల్లాలకు నియమిస్తుంది. దీంతో క్షేత్రస్థాయిలో రెవెన్యూ సమస్యలపై పట్టులేకుండాపోతోందనే విమర్శ ఉంది. సబ్ కలెక్టర్‌గా రెవెన్యూ విభాగంలో కొంతకాలం పని చేసి అదనపు కలెక్టర్‌గా స్థానిక సంస్థల్లో పనిచేస్తే మొత్తం పాలనపై అనుభవం వస్తుందన్న కోణంలో ప్రభుత్వం సబ్ కలెక్టర్ నియామకాలను చేపట్టిందని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు. మరో వైపు ధరణి వెబ్ సైట్‌తో రైతులు పలు రకాల భూసమస్యలు ఎదుర్కొంటున్నారు. వాటి పరిష్కారం కోసం ప్రజల నుంచి స్వీకరించిన వినతులను ఆర్డీవోల ద్వారా కలెక్టరేట్‌కు పంపుతున్నారు. ఇలాంటి దరఖాస్తులు వెల్లువెత్తుతుండగా, ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. ఆ కోణంలోనే రెవెన్యూ డివిజన్ స్థాయిలోనే పలు సమస్యలు పరిష్కరించేందుకు సబ్ కలెక్టర్ల నియామకంతో మార్గం సుగమమవుతుందని రెవెన్యూ అధికారులు అభిప్రాయపడుతున్నారు. మరికొన్ని విషయాల్లో కలెక్టర్ స్థాయిలో తీసుకునే నిర్ణయాలను సబ్ కలెక్టర్లు పూర్తి చేసే వీలు కలుగుతుందని అంటున్నారు.

పదోన్నతులపై ఆర్డీవో పోస్టుల్లో నియామకమైన వారు స్థానిక రాజకీయ, ప్రజాప్రతినిధుల మాటలకు తలొగ్గి కొన్ని సందర్భాల్లో కఠిన చర్యలు చేపట్టలేకపోతున్నారనే వాదనలు ఉన్నాయి. ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జా లాంటి చర్యలను సమర్థంగా అడ్డుకోలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆర్డీవోల స్థానంలో ఐఏఎస్ స్థాయి అధికారులను సబ్ కలెక్టర్‌గా నియమించనుండటంతో రెవెన్యూ శాఖలో రాజకీయ జోక్యం తగ్గుతుందని పలువురు పాలనా నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో పాటుగా క్షేత్రస్థాయి అనుభవంతో మున్ముందు కలెక్టర్లుగా వారి పాలన అనుభవం గడించే అవకాశం కూడా ఉంది.

వేగవంతం కానున్న ప్రాజెక్ట్ పనులు

దేవరకొండ డివిజన్‌లో డిండి ఎత్తిపోతల, ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి, పెండ్లిపాకల రిజర్వాయర్‌ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. డిండి ఎత్తిపోతల రిజర్వాయర్, పెండ్లిపాకల, నక్కలగండి రిజర్వాయర్ కింద పలు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ముంపు బాధితులకు పునరావాసం కల్పించాల్సి ఉండగా, ప్రస్తుతం ఆ ప్రక్రియ కొనసాగుతోంది. సబ్‌కలెక్టర్‌గా ఐఏఎస్‌స్థాయి అధికారి బాధ్యతలు తీసుకుంటే భూసేకరణ పనులు కూడా వేగవంతమయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతోపాటు ప్రాజెక్టుల కింద కొంత మంది రైతులకు భూపరిహారం, ఆర్అండ్ఆర్ అందనుంది. ప్రజాపాలనలో వచ్చే దరఖాస్తులు సైతం వేగవంతంగా పరిష్కారమయ్యే అవకాశాలు ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

● ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ, జూన్ 20: ప్రజలకు మెరుగైన సేవలందించడానికి పోలీస్ అధికారులు, సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యలయంలో నిర్వహించిన సమావేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. సమర్థవంతమైన సేవలు అందజేసి సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములునాయక్, ఎస్బీ డీఎస్పీ రమేష్, నల్లగొండ, మిర్యాలగూడ డీఎస్పీలు శివరాంరెడ్డి, రాజశేఖర్‌రాజు, సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీ

జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరు, వారి సమస్యలపై ఆరా తీశారు. సాంకేతికంగా ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండి, వృత్తినైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాలను స్టేషన్ సిబ్బంది వివరాలను రికార్డుల నిర్వహణ, కేసుల స్థితిగతులు, శాంతిభద్రతల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నల్లగొండ ఎస్బీ డీఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, టూటౌన్ సీఐ డేనియల్ కుమార్, ఎస్బీ సీఐ రాఘవరావు, ఎస్ఐలు నాగరాజు, సందీప్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయాధికారిని కలిసిన ఎస్పీ

ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం నాడు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ జిల్లా కోర్టు చాంబర్‌లో జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

నీలగిరిలో బైపాస్ రగడ

- అలైన్‌మెంట్‌పై తీవ్ర అభ్యంతరాలు
- విలువైన ఆస్తులు కోల్పోతున్నామని బాధితుల ఆందోళన
- మూడో ప్రతిపాదన రద్దు చేయాలని డిమాండ్
- ఒకటో ప్రతిపాదనతో బాధితుల సంఖ్య తక్కువ

నల్లగొండ, జూన్ 20: జిల్లా కేంద్రమైన నల్లగొండ పట్టణంలో బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్‌పై చిచ్చు రాజుకుంది. అధికార పార్టీ ఆప్షన్-3 ద్వారా చేపట్టాలనుకున్న నిర్మాణంపై ప్రతిపక్ష పార్టీలతో పాటు బాధితుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మాచర్ల-నకిరేకల్ జాతీయ రహదారిని తొలుత నల్లగొండ పట్టణం మధ్య నుంచి ప్రతిపాదించగా, రోడ్డు విస్తరణతో పెద్ద సంఖ్యలో ప్రజలు ఇళ్లు కోల్పోవాల్సి రావడం, ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉండటంతో జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్చాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు ప్రజలు సైతం డిమాండ్ చేశారు. దీంతో ప్రభుత్వం, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులతో మాట్లాడి పట్టణం బయటి నుంచి రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరగా, ఎన్‌హెచ్‌ఏ అధికారులు మూడు రకాల ప్రతిపాదనలు కోరారు. ప్రభుత్వం ప్రతిపాదనలను ఎన్‌హెచ్‌ఏ అధికారులకు మూడు ప్రతిపాదనలు పంపింది. అందులో పానగల్లు శివారు నుంచి ఉదయ సముద్రం మీదుగా కొత్తగూడెం నుంచి సాగర్ రోడ్డుకు కలిపేలా ఒక ప్రతిపాదన ఉంది. దీనికి కాకుండా పట్టణ శివారు కాలనీల నుంచి వెళ్లే మూడో ప్రతిపాదనకు ఎన్‌హెచ్‌ఏ అధికారులు ఆమోదం తెలపడంతో అగ్గి రాజేసినట్టయింది. ఆప్షన్-1లో కేవలం వ్యవసాయ భూములు మాత్రమే పోతుండగా, ఆప్షన్-3లో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, కమర్షియల్ మడిగలు అధికంగా పోతున్నాయి. దీంతో వాటి యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గజిబిజి ప్రతిపాదనలతో సమస్యలు

బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి చేసిన ప్రతిపాదనలు గజిబిజిగా ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొదటి ప్రతిపాదనలో పానగల్లు ఉదయ సముద్రం ప్రాజెక్టు గేటు నుంచి 11కి.మీ మేర రూ.690కోట్లతో అద్దంకి బైపాస్ మార్గం మీదుగా కేశరాజుపల్లి, ఎస్ఎల్‌బీసీ వరకు ప్రతిపాదించారు. రెండో ప్రతిపాదనలో 20కి.మీల రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.1,000కోట్లతో పానగల్లు ఛాయ సోమేశ్వర ఆలయం నుంచి చర్లపల్లి మీదుగా కతాల్‌గూడ, మామిళ్లగూడ, ఎస్ఎల్‌బీసీ వరకు రోడ్డు నిర్మించాలి. మూడో ప్రతిపాదన సుమారు రూ.700కోట్లతో 15.5కి.మీల మేర పానగల్లు, మర్రిగూడ సర్కిల్, గిరకబాయిగూడ, హౌసింగ్‌బోర్డు, కతాల్ మీదుగా ఎస్ఎల్‌బీసీ వరకు రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ మూడు ప్రతిపాదనలు భిన్నంగా ఉన్నాయి. మూడో ప్రతిపాదనకు ఎన్‌హెచ్‌ఏ అధికారులు ఆమోదించడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యమబాట పట్టిన బాధితులు

రోడ్డు నిర్మాణం మూడో ప్రతిపాదన ప్రకారం చేస్తే ఆస్తులు కోల్పోతామని బాధితులు ఆందోళన చెందుతున్నారు. మొదటి అలైన్‌మెంట్ ప్రకారం రోడ్డు నిర్మించాలని బాధితులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. మూడో ప్రతిపాదనతో మొత్తం 2,840మంది ఇళ్ల, ఇళ్ల స్థలాలు, మడిగలు కోల్పోనున్నారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం తక్కువగా ఉండనుంది. బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం వచ్చే పరిస్థితి లేదు. నల్లగొండ బైపాస్‌లో ఒకరు మూడు మడిగెలను రూ.90లక్షలకు కొనుగోలు చేశారు. మూడో ప్రతిపాదన ప్రకారం బైపాస్ రోడ్డు నిర్మాణం జరిగితే అతడికి ఒక్కో మడిగకు రూ.15లక్షలు మాత్రమే పరిహారం వస్తుంది. ఇలా చాలా మంది విలువైన ఆస్తులు కోల్పోయే ప్రమాదం ఉంది.



బైపాస్ రోడ్డు నిర్మాణానికి మూడు ప్రతిపాదనలు ఇవి


మూడో ఆప్షన్‌ను తక్షణమే రద్దు చేయాలి



సుమారు 2,840మందికి ఆర్థికంగా నష్టం వాటిల్లే మూడో ఆప్షన్‌ను ప్రభుత్వం వెంటనే స్పందించి రద్దు చేయాలి. లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తాం. నేను 2004లో 660గజాల స్థలాన్ని ఎస్ఎల్‌బీసీ సమీపంలో కొనుగోలు చేశా. ఇప్పుడు ఆ ఆస్తి విలువ పెరిగింది. బైపాస్ రోడ్డు నిర్మిస్తే ఆ ప్లాట్ పోవడంతో ఆర్థికంగా నష్టపోతా. నాలాంటి వారు పేద, మధ్యతరగతి వారు కూడా ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్న వారు ఉన్నారు. బైస్‌తో వారంతా నష్టపోతారు.

బీరెల్లి రామచంద్రయ్య, బాధితుడు

ప్రభుత్వ నిర్ణయం ఉపసంహరించుకోవాలి



ఎంతో మందికి నష్టం వాటిల్లే మూడో ప్రతిపాదనను తక్షణమే రద్దు చేయాలి. మొదటి ఆప్షన్ ప్రకారం రోడ్డు నిర్మించాలి. వ్యవసాయ భూములు మాత్రమే కోల్పోయే ప్రాంతం నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టాలి. నేను మర్రిగూడ బైపాస్ వద్ద మూడు మడిగలను కొనుగోలు చేశా. ఆ మడిగలు ఒక్కో దానికి రూ.90లక్షలు వెచ్చించా. ఆ మడిగలు పోతే ప్రభుత్వం నుంచి ఒక్కో మడిగకు రూ.15లక్షలు వచ్చే పరిస్థితి కూడా లేదు. ఇది ఆర్థిక నష్టమే.

ఎ.యాదగిరిరెడ్డి, బాధితుడు

ఏఎమ్మార్పీ నుంచి నిరంతరాయంగా నీటి సరఫరా

● జెన్‌కో హైడల్ డైరెక్టర్ వెంకటరాజారామ్

పెద్దఅడిశర్లపల్లి, జూన్20: ఏఎమ్మార్పీ ప్రాజెక్టు నుంచి ఎలాంటి అంతరాయం లేకుండా జంటనగరాలకు నీటి సరఫరా చేయాలని తెలంగాణ జెన్‌కో హైడల్ డైరెక్టర్ వెంకటరాజారామ్ అన్నారు. గురువారం పుట్టగండి పంపుహౌస్, జీరో పాయింట్ వద్ద కొనసాగుతున్న అత్యవసర మోటర్ల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఏఎమ్మార్పీ ఒకటో యూనిట్ మోటర్ల మరమ్మతులను వేగవంతం చేయాలని, సాగర్ నీటిమట్టం మరింత తగ్గినా నీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైతే మరో ప్రత్యామ్నాయ మోటరును సిద్ధం చేయాలన్నారు. అత్యవసర మోటర్ల ద్వారా పుట్టగండి మోటర్లకు 510 అడుగుల లెవల్‌కు చేరుకునే నీటిని అప్రోచ్ కెనాల్‌లోకి ఎత్తిపోయాలని అధికారులను ఆదేశించారు. జెన్‌కో, మెట్రో బోర్డు ఇరిగేషన్ అధికారులు సమన్వయం చేసుకుని నీటిని నిరంతరం తరలించాలని అన్నారు. ఆయనవెంట జెన్‌కో సీఈ ఉపేందర్, ఎస్ఈ వెంకటవర్మ, రఘురాం, డీఈలు వెంకటేశ్వర్లు, నరేందర్‌రెడ్డి, ఏడీలు సత్యనారాయణ, సుధాకర్, సంజీవరెడ్డి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

వానాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

● అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

దేవరకొండ, జూన్ 20: వానాకాలంలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. గురువారం దేవరకొండ మునిసిపల్ కార్యాలయాన్ని తనిఖీచేసి అధికారులతో సమావేశమయ్యారు. వర్షాకాలంలో తీసుకునే చర్యలు, 'అమ్మ ఆదర్శ పాఠశాల'ల పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీల్లో మురుగునీరు నిల్వకుండా, దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపాలిటీలోని సమస్యలు, 'ప్రజావాణి' దరఖాస్తుల వివరాలను కమిషనర్ భాస్కర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మునిసిపల్ ఇంజనీర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

'ధరణి' పరిష్కారంలో జాగ్రత్తగా ఉండాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



నల్లగొండ టౌన్, జూన్ 20: 'ధరణి' దరఖాస్తుల పరిష్కారంలో జాగ్రత్తగా ఉండాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ధరణి' సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. మిస్సింగ్ సర్వే నెంబర్స్, పెండింగ్ మ్యుటేషన్లు, కోర్టు కేసులు, తదితర అంశాలపై వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఏ మాడ్యుల్‌కు ఏ అంశాలను పరిశీలించాలనే విషయాలతో రిమార్క్స్ తప్పులు లేకుండా రాయాలన్నారు. సమస్య ఎక్కడుందో గుర్తించి చెక్‌లిస్టులో పొందుపరచాలన్నారు. ఏ అనుమానం వచ్చినా తాము అందుబాటులో ఉంటామన్నారు. సమావేశంలో కలెక్టరేట్‌లోని పలు సెక్షన్లకు చెందిన సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కల్తీ లేని పదార్థాలను విక్రయించాలి



బేకరీలో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి స్వాతి

ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి స్వాతి

హాలియా, జూన్ 20: ప్రజలకు కల్తీ లేని, నాణ్యమైన ఆహార పదార్థాలను విక్రయించాలని ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి స్వాతి అన్నారు. గురువారం హాలియాలోని ఫేమస్ బేకరీని తనిఖీచేసి రూ.15వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆహార పదార్థాల నమూనాలను పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని స్టేట్ ఫుడ్ ల్యాబ్‌కు పంపించామని, నివేదికలో కల్తీ అని తేలితే కఠిన చర్యల తీసుకుంటామన్నారు. హోటళ్లలో వాడిన నూనెను, సింథటిక్ రసాయనాలను వాడకూడదన్నారు. కిరాణ దుకాణాల్లో గడువుమీరిన వస్తువులను విక్రయిస్తే రూ.1లక్ష వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఆమె వెంట మునిసిపల్ కమిషనర్ మున్వర్ అలీ, మునిసిపాలిటీ సిబ్బంది ఉన్నారు.

త్రిబుల్ ఆర్ నిర్మాణానికి రైతులు సహకరించాలి

● చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి

వలిగొండ, జూన్ 20: రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిబుల్ ఆర్) నిర్మాణానికి రైతులు సహకరించాలని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలకేంద్రంలోని రైతు వేదికలో గురువారం త్రిబుల్‌ఆర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివా‌స్‌రెడ్డి, డి ప్యూటీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సీనియర్ అసిస్టెంట్ సురేందర్‌శర్మ, ఎంఆర్‌ఐ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో బలవన్మరణం

దామరచర్ల, జూన్ 20: ఉరి వేసుకొని యువతి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండలకేంద్రంలో గురువారం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన దొడ్ల సురేష్ మండలంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో ఉద్యోగిగా పనిచేస్తూ దామరచర్లలో నివాసం ఉంటున్నాడు. అతనితోపాటు పాల్వంచకు చెందిన ప్రియాంక(34)తో సహజీవనం సాగిస్తున్నట్లు సమాచారం. ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రియాంక అద్దెకు ఉంటున్న ఇంట్లోనే చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన సురేష్ చున్నీని కత్తిరించి కిందికి దించి 108కు సమాచారం అందించాడు. అప్పటికే ప్రియాంక మృతిచెందినట్లు 108 సిబ్బంది గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడకు తరలించారు. ప్రియాంక మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు భర్తగా చెప్పుకుంటున్న సురేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రియాంక బంధువులు దూరప్రాంతంలో ఉండడంతో వారు ఇక్కడికి వచ్చేందుకు సమయం పట్టనున్నట్లు తెలిసింది. ఈ సంఘటనకు సంబంధించి ఇప్పటివరకు పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

సారా విక్రయిస్తున్న వారిపై కేసు

కొండమల్లేపల్లి, జూన్ 20: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని ఆంగోతుతండాకు చెందిన వ్యక్తి ఐదు లీటర్ల సారాను కొండమల్లేపల్లికి తీసుకెళ్తుండగా పోలీసులు గురువారం పట్టుకున్నారు. కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన సదరు వ్యక్తిని పట్టుకొని సారా సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా దేవరకొండలో ఓ మహిళ నాలుగు లీటర్ల సారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకొని సారా సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

అందరికీ ఆరోగ్య యోగం

● యోగాతో సంపూర్ణ ఆరోగ్యం ● మానసిక ఒత్తిడి అధిగమించడానికి మార్గం ● నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

చిట్యాల రూరల్, జూన్ 20: చిట్యాలలో రెండున్నర దశాబ్దాల క్రితం కొందరితో మొదలైన యోగా శిక్షణ నేడు అందరికీ ఆరోగ్య యోగం కల్పిస్తోంది. యోగా సాధనకు సాధకులకు కేంద్రం అవసరమవ్వగా స్థానికంగా వనిపాకల రోడ్డులో రుషీ సంస్కృతి యోగా సేవా కేంద్రం పేరిట సిద్ధ సమాధియోగా ధ్యాన మంది రాన్ని నాలుగేళ్ల క్రితం నిర్మించారు. అందులో గురుజీ యోగా సాధన, ప్రాణాయామం, ధ్యానంతో పాటుగా మేధాశక్తిపై సాధకులకు శిక్షణని స్తుంటారు. ధ్యాన మందిరంలో సాధకులు నిత్యం సాధన చేస్తుం టారు. మరో ప్రాంతంలో ఎస్‌బీఐ వెనుక భాగంలో పత్రిజీ ఆధ్వర్యంలో ఏడాది క్రితం శ్రీవారిజాల వేణుగోపాలస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఏర్పాటు చేశారు. నిత్యం 15మంది పిరమిడ్ కేంద్రంలో ధ్యానం చేస్తుంటారు.



చిట్యాలలో యోగా శిక్షణ ఇస్తున్న బాపూజి గురుజీ


యోగా శిక్షణతో ఆరోగ్య యోగం, ప్రాణశక్తి



ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా శిక్షణ, ఆరోగ్యపు అలవాట్లలో మార్పు తప్పనిసరి. యోగా చేయడం కష్టమేమీ కాదు.. సులువైన పద్ధతిలోనే ఉంటుంది. శిక్షణలో ప్రాణాయామం చేయ డంతో ప్రాణశక్తి లభిస్తుంది. శ్వాసను ఉచ్వాస నిచ్వాస ద్వారా శిక్షణ ప్రాణశక్తి వస్తుంది. యోగా ద్వారా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుం టే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. అంతేకాకుండా క్రమశిక్షణ కూడా అలవరమేకాకుండా మేధస్సును పెంపొందిస్తుంది.

● బాపూజి, యోగా గురుజీ, చిట్యాల

ధ్యానంతో మేధాశక్తి



ధ్యానం చేయడం ఎంతో ఉత్తమం. దాని ద్వారా మేధాశక్తిని పెంపొందించుకోవచ్చు. ధ్యానం చేయడం కష్టమైన పని తమ వల్ల కాదని అనుకోవద్దు. అందరికీ సాధ్యమైన పనే. ఒక ప్రాంతంలో కళ్లు మూసుకుని కూర్చుని శ్వాస మీద ధ్యాస పెట్టాలి. ధ్యానం చేస్తే మేధస్సును పెంపొందిచడంతో పాటు ఆరోగ్యం, మనస్సు స్థిమితం, ప్రశాంతంత కలుగు తుంది. నిత్యం ధ్యానం చేస్తూ రోజురోజుకు పెంచు కుంటే మెదడు శక్తివంతంగా మారుతుంది. .

● పున్న పాండు, యోగా శిక్షకుడు, చిట్యాల.



యోగాసనాలు చేస్తున్న డీఎస్పీ శ్రీలక్ష్మి(ఫైల్)



యోగాసనాల్లో దిట్ట డీఎస్పీ శ్రీలక్ష్మి

నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన డీఎస్పీ తుమ్మల శ్రీలక్ష్మి యోగాసనాలు వేస్తూ యోగాసన పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో బంగారు, కాంస్య పతకాలు సాధించారు. హైదరాబాద్‌లో 1996లో ఎస్ఐగా, సీఐగా పనిచేసి డీఎస్పీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం అంబర్‌పేట్‌లోని పోలీస్ శిక్షణ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం తన ఫిట్‌నెస్ కోసం చేసిన యోగాలో శిక్షణ పొంది నిత్యం సాధన చేస్తుండేవారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో పాల్గొన్న శ్రీలక్ష్మి 2015, 2016, 2017, 2022, 2023, 2024లో కాంస్య, బంగారు పతకాలు సాధించారు. రాష్ట్రం తరుపున యోగాసనాల పోటీల్లో పాల్గొని జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చి విజయాలు సొంతం చేసుకు న్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన డీఎస్పీ శ్రీలక్ష్మిని డీజీపీ రవిగుప్తా అభినందించారు.

ఈ యోగా సిస్టర్స్ ప్రత్యేకం

నార్కట్‌పల్లి: అలవోకగా యోగాసనాలు వేస్తూ భళా అనిపించుకుంటున్నారు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బీ.వెల్లెంల జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అక్కా చెల్లెళ్లు దాసోజు సంజన, సౌమ్య. నల్లగొండ మండలం అప్పాజిపేటకు చెందిన దాసోజు నర్సింహ్మాచారి వృత్తిరీత్యా స్వర్ణకారుడు. ఆయన కరాటే, యోగాలో పలువురికి శిక్షణ ఇచ్చేవాడు. ఆ సమయంలో కాలక్షేపం కోసం తన ఇద్దరు కూతుళ్లను తాను శిక్షణ ఇచ్చే యోగసనాలు చూపిచ్చేందుకు తీసుకెళ్లేవాడు. వారు కూడా అలవోకగా యోగసనాలు వేస్తూ అబ్బురపరిచారు. పిల్లల్లో యోగాసనాల పట్ల ఉన్న ఆసక్తిని గమనించిన నర్సింహ్మాచారి తానే గురువై కరాటేతో పాటు, యోగాసనాలు వేయడంలో తర్ఫీదునిచ్చాడు. ఉదయం ఓ సారి, పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చిన తర్వాత సాయంత్రం వేళల్లో మరోసారి ఆసనాలు వేస్తూ అక్కా చెల్లెళ్లు ఇద్దరూ యోగాలో ప్రావీణ్యం సాధించారు. తండ్రి ప్రోత్సాహంతో పలు జిల్లా, రాష్ట్ర స్థాయి వేదికలపై యోగా, కరాటే పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. ప్రముఖుల నుంచి అవార్డులు అందుకున్నారు. సంజన పదో తరగతి పూర్తిచేయగా, సౌమ్య 10వ తరగతి చదువుతోంది.



యోగాలో సంజన, సౌమ్య ప్రశంసలు

- తక్కువ వయసులో ఎక్కువ ఆసనాలు వేసి తెలంగాణ తెలుగు బుక్ ఆఫ్ రికార్డు
- 2015లో నకిరేకల్‌లో ఏవీఎం పాఠశాలలో షాటోకాన్ కరాటే పోటీల సందర్భంగా కఠినమైన యోగసనాలు వేసి ఎమ్మెల్యే వేముల వీరేశం నుంచి ప్రతిభా అవార్డులు అందుకున్నారు.
- 2016లో ఆర్యసమాజ్ మందిర్‌లో జాతీయ దినోత్సవం సందర్భంగా యోగాసనాలు ప్రదర్శించి నగదు బహుమతి పొందారు
- 2017లో నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన యోగా పోటీల్లో పాల్గొని అప్పటి కలెక్టర్ సత్యనారాయణరెడ్డి నుంచి అభినందనలు.
- 2017 అక్టోబరు 13 నుంచి 15వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో జరిగిన 63వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-17 విభాగంలో సంజన బంగారు పతకం అందుకుంది.
- మాస్టర్లే ఆశ్చర్యపడేలా యోగాసనాలు వేసిన యోగా సిస్టర్స్ సంజన, సౌమ్యలను అప్పటి ఎస్పీ ఏవీ రంగనాథ్ అభినందించారు.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య తిరుకల్యాణం

భువనగిరి అర్బన్, జూన్ 20: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు పాంచరాత్రాగమ రీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయ నైరుతి దిశలో అష్ట భుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి, ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో సాంప్రదాయరీతిలో నిత్య పూజలు వైభవంగా జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం, శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 26,14,890 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్న భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను ఈ నెల 27న ఉదయం 7గంటలకు కొండకింద రెండో వ్రతమండపంలో లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈవో భాస్కరరావు తెలిపారు.కొండకింద యాదగిరిపల్లిలోని లక్ష్మీహయగ్రీవ స్వామి ఆలయంలో ఈనెల 21నుంచి 26 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 23వ తేదీన ఎదుర్కోళ్ల ఉత్సవం, 24న కల్యాణోత్సవం, 25న రథోత్సవం, 26వ తేదీన జరిగే చక్రతీర్థం, మహాపూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తారు.



ప్రధానాలయంలో తిరుకల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

'పేట'లో ఎనిమిది కిలోల గంజాయి పట్టివేత

● బైక్‌పై తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్న పోలీసులు

భానుపురి, జూన్ 20: సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎనిమిది కిలోల గంజాయిని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ రవి కేసు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట పట్టణంలోని ఖమ్మంక్రాస్‌రోడ్డులో అమ్మగార్డెన్ సమీపంలోని రోడ్డుపై పట్టణ పోలీసులు ఉదయం ఏడు గంటల ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తున్న ముగ్గురిని ఆపి తనిఖీ చేశారు. చింతలచెర్వుకు చెందిన కోడిదల పవన్‌కుమార్, శ్రీరాంనగర్‌కు చెందిన మన్నె రాహుల్, సూర్యాపేటకు చెందిన మైనర్ బాలుడు ఉన్నారు. వీరిలో ఒకరి చేతిలో నలుపు, గులాబీ రంగు గల బ్యాగ్ లోపల నాలుగు గోధుమ రంగు టేప్‌తో చుట్టిన ప్యాకెట్లలో గంజాయి ఉంది. వీరిని విచారించగా పవన్, అబ్దుల్ రహీం కలిసి ఖమ్మం నుంచి ట్రైన్‌లో ఏపీ రాష్ట్రంలోని అరకు వెళ్లి అక్కడ గంజాయి రూ. 8వేల చొప్పున ఎనిమిది కిలోలు కొనుగోలు చేశారు. అక్కడి నుంచి ఖమ్మం వచ్చారు. రాహుల్ తన బైక్‌పై ఖమ్మం వెళ్లి వారిని ఎక్కించుకుని సూర్యాపేటకు గంజాయి తీసుకొస్తుండగా పట్టుపడ్డారు. సూర్యాపేటలో కేజీ రూ.20నుంచి రూ.30వేల వరకు విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు నిందితులు తెలిపారని పేర్కొన్నారు. గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి జైలుకు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును చేధించిన పట్టణ సీఐ రాజశేఖర్, పట్టణ ఎస్ఐలు మహేంద్రనాథ్, కుశలవ, క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, కరుణాకర్, సైదులు, కానిస్టేబుళ్లు ఆనంద్, మధును ఏఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

కారులో వచ్చి మేకలు అపహరించి..

పెద్దఅడిశర్లపల్లి, జూన్20: నెంబర్ ప్లేటు లేని కారులో తిరుగుతున్న గుర్తుతెలియని వ్యక్తులు మేకలను అపహరిస్తున్నారు. ఇంటి వద్ద పాకలో కట్టేసిన మేకలను దొంగిలించడమే లక్ష్యం తిరుగుతున్నారు. నెలలో మోటర్ కేబుల్ దొంగతనం మరువకముందే బుధవారం రాత్రి కారులో వచ్చిన దొంగలు గుడిపల్లి మండలంలోని రాయినిపాలెం గ్రామానికి చెందిన శాస్త్రీ సుందరయ్య అనే వ్యక్తి మేకల మందపై పడి నాలుగు మేకలను కారులో వేసుకొని పరారయ్యారు. వీటి విలువ సుమారు రూ. 60 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. అదేవిధంగా పీఏపల్లి మండలం మేకలవారిగూడెం చెందిన నారబోయిన మల్లయ్యకు చెందిన మేకల మంద నుంచి మేకను దొంగిలించి కారులో ఎక్కించుకుని పోతుండగా కారు అడ్డగించడంతో రీవర్స్ తీసుకుని పారిపోయారని బాధితుడు తెలిపాడు. దీని విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు

ఆరోపణలపై విచారణ

మర్రిగూడ, జూన్ 20: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు అధికారి వెంకటేష్‌పై డీఆర్‌డీవో అదనపు పీడీ నవీన్‌కుమార్ గురువారం మండల పరిషత్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఏపీవో ఫీల్డ్ అసిస్టెంట్‌లను వేధింపులకు గురిచేస్తూ ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపాలని బెదిరింపులకు గురిచేస్తున ఆరోపణలపై, అదేవిధంగా ఏపీవో వెంకటేష్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు సక్రమంగా విధులు నిర్వహిస్తా లేరంటూ ఎంపీడీవో మున్నయ్యకు ఫిర్యాదు చేశారు. మే 21న చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా అధికారులకు తెలిపారు. ఫిర్యాదులపై అదనపు పీడీ విచారణ నిర్వహించారు. జిల్లా పీడీకి నివేదికను పంపనున్నట్లు తెలిపారు. ఆయనవెంట దేవరకొండ ఉపాధిహామీ క్లస్టర్ అధికారి బాలకృష్ణ, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ప్రాణం కాపాడిన బ్లూకోట్స్ సిబ్బంది

● గుండెనొప్పితో బాధపడుతున్న లారీ డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలింపు

● సకాలంలో తీసుకెళ్లడంతో దక్కిన ప్రాణం

చౌటుప్పల్ రూరల్, జూన్ 20: గుండెనొప్పితో బాధపడుతున్న లారీ డ్రైవర్‌ను బ్లూకోట్స్ సిబ్బంది సకాలంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఈ సంఘటన జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన వెంకటరమణ(53)కు సొంత లారీ ఉంది. కుమారుడు అర్జున్‌కుమార్‌తో బుధవారం మధ్యాహ్నం లోడ్ లారీతో హైదరాబాద్‌కు బయలుదేరారు. బుధవారం అర్ధరాత్రి చిట్యాల వద్దకు రాగానే వాహనం నడుపుతున్న వెంకటరమణకు గుండెనొప్పి వచ్చింది. దీంతో 25కిలోమీటర్ల దూరంలో ఉన్న చౌటుప్పల్ వరకు కుమారుడు అర్జున్‌కుమార్ వాహనం నడిపాడు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తంగడపల్లి చౌరస్తా వద్ద నిలిపి పెట్రోలింగ్ చేస్తున్న బ్లూకోట్స్ పోలీసులు నాగరాజు, వెంకటేశంకు విషయం చెప్పాడు. వారు వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి సమాచారం ఇచ్చారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంకటరమణను తమ వాహనంపై ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి వెంకటరమణ పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో అంబులెన్స్‌ను రప్పించి హైదరాబాద్‌కు పంపించారు. అక్కడి వైద్యులు వెంకటరమణకు మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. సకాలంలో ఆస్పత్రికి తరలించి వెంకటరమణ ప్రాణాలు కాపాడిన బ్లూకోట్స్ సిబ్బందిని సీఐ ఆశోక్‌రెడ్డి అభినందించారు.



చికిత్స పొందుతున్న వెంకటరమణ

తాగునీటి కొరత లేకుండా చూడాలి : బాలునాయక్


మిషన్‌భగీరథ పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూన్ 20: దేవరకొండ పట్టణానికి తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అధికారులను ఆదేశించారు. మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మిషన్‌భగీరథ అధికారులతో కలిసి గురువారం మిషన్ భగీరథ పంపుహౌస్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వార్డులకు సరిపడా తాగునీరు అందించాలని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట భగీరథ అధికారులు రాజు, సత్యనారాయణ, నాయకులు ఉన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి తోడ్పడాలి : ఎంపీపీ


ఎంపీటీసీలను సన్మానించిన ఎంపీడీవో, సిబ్బంది

మర్రిగూడ, జూన్ 20: అధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ గండికోట రాజమణిహరికృష్ణ, జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి అన్నారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం ఎంపీడీవో మున్నయ్య అధ్యక్షతన చివరి సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలో చేపట్టిన, చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలు, పలు అంశాలపై చర్చించారు. అంతంపేట గ్రామంలో భూఆక్రమణ, లెంకపల్లి గ్రామంలో తెగిన ముకాశీకుంట కట్ట, బీసీ, ఎస్టీ వసతి గృహాలకు పక్కాగృహాలు లేకపోవడం వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు గురించి చర్చించారు. ఎంపీడీవో మున్నయ్య సమస్యలపై జిల్లా అధికారులకు నివేదిక పంపుతానని తెలిపారు. ఎంపీటీసీల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఎంపీడీవో, సిబ్బంది ఎంపీపీ, జడ్పీటీసీ తో పాటు పలు ఎంపీటీసీలకు శాలువాలు కప్పి సన్మానించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ యాకుబ్‌ఆలీ, కోఆప్షన్ సభ్యుడు యాకుబ్, ఏవో హేమలత, ఎంఈవో గురువారావు, ఎంపీటీసీలు మమతరవీందర్‌రావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను పూర్తి చేయాలి : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పాండమ్మ

త్రిపురారం జూన్ 20: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ అనుముల పాండమ్మ అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ పాండమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని మండలంలో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎంపీటీసీలకు చివరి మండల సర్వసభ్య సమావేశం కావడంతో అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో విజయకుమారి, జడ్పీటీసీ భారతిభాస్కర్‌నాయక్, వైస్ ఎంపీపీ మట్టయ్య, ఎంపీపీ సలహాదారుడు శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు

మాడ్గులపల్లి, జూన్ 20: రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, నాసిరకం విత్తనాలను అంటగట్టి మోసాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన స్టాక్ రిజిస్టర్లు, రశీదులు, ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రశీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలన్నారు. డీలర్లందరూ ఎరువుల విక్రయాలు ఈ పాస్ ద్వారా మాత్రమే కొనసాగించాలన్నారు. ఆయన వెంట ఏవో సైదానాయక్ తదితరులు ఉన్నారు.

ఆస్పత్రి కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

దేవరకొండ, జూన్ 20: దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు జీవో ప్రకారం రూ.15,500 వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. గురువారం ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులు నిర్వహించిన ధర్నాకు ఆయన హాజరై మాట్లాడారు. కార్మికులకు పనికి తగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచి నెల, నెలా వేతనాలు అందజేయాలని లేనిచో సమ్మె చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి మల్లయ్య, కార్మికులు రామేశ్వరమ్మ, రాణి, భద్రమ్మ, జానకి, మల్లమ్మ, సరిత తదితరులు పాల్గొన్నారు.

సుంకరి ఆనంద్‌కు ఉగాది కీర్తి రత్న పురస్కారం

శాలిగౌరారం, జూన్ 20: శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త సుంకరి ఆనంద్‌కు ఉగాది కీర్తి రత్న పురస్కారానికి ఎంపికయ్యారు. ఫెడరేషన్ ఆఫ్ ఎన్‌ఆర్‌ఐ కల్చరల్ అసోసియేషన్ వారు ఈ నెల 29వ తేదీన మలేషియాలోని కౌలాలంపూర్‌లో అంతర్జాతీయ వేదికపై ఆనంద్‌కు ఉగాది కీర్తి రత్న పురస్కారం అందజేయనున్నారు. గతంలో ఆనంద్ ఎన్నో అవార్డులు, సత్కారాలు అందుకున్నారు.

పాఠశాలల్లో పెండింగ్ పనులను పూర్తి చేయాలి

అడవిదేవులపల్లి, జూన్ 20: ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీవో కరుణాకర్‌రావు ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం రైతు మిత్ర ఏజెన్సీ దుకాణాన్ని సందర్శించి తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీరామాంజనేయులు, ఎంపీవో మోసిన్‌బిన్‌అహ్మద్, హెచ్‌ఎం వరలక్ష్మి, సీహెచ్‌వో షాహిద్, అబ్బాస్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి : బంటు


పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 20: పార్టీని బలోపేతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు వెంకటేశ్వర్లు అన్నారు. ఏపీ సీఎం సతీమణి భువనేశ్వరి జన్మదినం సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తనయురాలైన భువనేశ్వరి ఎన్టీఆర్ ట్రస్ట్‌తో చేస్తున్న ప్రజాయోగ్యమైన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్, చిలుకల వెంకన్న, మచ్చ సైదులు, గోపాలకృష్ణ, అనంతరాములు, నాగేందర్, శంకర్‌రావు, నగేష్, సైదులు, శ్రీనివాస్, గణేష్, శోభనాద్రి పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లను సరిచేసిన సిబ్బంది

నార్కట్‌పల్లి, జూన్ 20: చేతికందే ఎత్తులో ఉండి ప్రమాదకరంగా మారిన వైర్లను విద్యుత్ సిబ్బంది సరిచేశారు. చేతికి అందే ఎత్తులో వేలాడుతున్న కరెంటు తీగలు శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు విద్యుత్ సిబ్బంది స్పందించారు. ఏఈ చంద్రశేఖర్‌రావు ఆదేశాలతో సమస్యను పరిష్కరించారు. చేతికందే ఎత్తులో వేలాడుతున్న వైర్లను పైకి లాగారు. సమస్య తలెత్తకుండా ఉండేందుకు రెండు స్తంభాలను కూడా అక్కడికి తరలించారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

చండూరు, జూన్ 20: ప్రభుత్వం కార్మికశాఖను సమీక్షించి కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం చండూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్వాడీలకు సమ్మె కాలం వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 24వ తేదీన ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. వెల్లడించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు దోటి వెంకన్న, కార్యదర్శి జెల్ల శ్రీను, నాయకులు సత్తయ్య, శ్రీను, రవి పాల్గొన్నారు.

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి


తిరుమలగిరి(సాగర్)లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఈ నెల 24 నుంచి ప్రతీ సోమవారం నిర్వహించే మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని పలువురు అధికారులు సూచించారు. జిల్లాలోని మండల కేంద్రాల్లో గురువారం నిర్వహించిన ప్రజావాణి సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజావాణిని ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలను స్వీకరించడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని, అర్జీలు స్వీకరించిన 15 రోజుల్లోగా పరిష్కరించేలా అధికారులు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

● తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి సన్నాహక సమావేశంలో జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్, మండల ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రతీ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో రమేష్, ఎంపీవో భిక్షంరాజు, మండల అధికారులు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● మాడ్గులపల్లిలో నిర్వహించిన సమావేశంలో మండల ప్రత్యేకాధికారి బొల్లారం భిక్షపతి మాట్లాడారు. మండలంలోని అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు.

● శాలిగౌరారంలో ఎంపీడీవో రేఖల లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వ్యవసాయశాఖ జిల్లా ఏడీఏ, మండల ప్రత్యేకాధికారి రామారావునాయక్ మాట్లాడారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు తీసుకుని ఒక్కో అర్జీకి విధిగా రశీదు ఇవ్వాలన్నారు. సమావేశంలో డీటీ అబ్దుల్ సత్తార్, ఏవో సౌమ్య శృతి, ఏంఈవో నాగయ్య, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లి ఎంపీడీవో కార్యాలయంలో డీఎంవో పి.శ్రీకాంత్, మండల నోడల్ అధికారి పి.కరుణాకర్‌రావు మాట్లాడారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో మండల ప్రత్యేకాధికారి రమేష్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమాన్ని సంబంధిత అధికారులందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఉమేష్‌చారి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో సుధాకర్ పాల్గొన్నారు.

● డిండిలో మండల ప్రత్యేక అధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీవో డానియెల్ ఉన్నారు.

● తిప్పర్తిలో మండల ప్రత్యేక అధికారి భూమన్న మాట్లాడుతూ పేద, ధనిక అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. అనంతరం మండలకేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన పరిశీలించి ఎరువుల అమ్మకం, స్టాకు వివరాలు పరిశీలించారు. ఎమ్మార్పీ రేట్లతో పాటు నాణ్యత పాటించేలా చూడాలని, సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ డి.స్వప్న, ఎంఈవో కె.అరుంధతి, పీఆర్ ఏఈ రాములు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాభవాని, ఏవో సన్నిరాజు పాల్గొన్నారు.


కనగల్: సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

● కనగల్‌లో నిర్వహించిన సమావేశంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ 15రోజుల్లోగా సమస్య పరిష్కారం కాని పక్షంలో ఫిర్యాదుదారుడు జిల్లా ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, సూపరింటెండెంట్ అల్తాఫ్, ఎంపీవో సుమలత, ఏవో అమరేందర్‌గౌడ్, ఏఈ రాజశేఖరాచారి తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరులో ఎంపీడీవో మాట్లాడుతూ మండల ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి


మిర్యాలగూడలో నట్టల నివారణమాత్రలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్ అన్నారు. జిల్లాలో గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, వైద్య అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యాభ్యాసంలో చురుకుగా ఉంటూ ఉన్నతశిఖరాలకు చేరుకుంటారని అన్నారు. వైద్యసిబ్బంది ప్రతి ఒక్కరికీ నట్టల నివారణ మాత్రలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. పిల్లలను పట్టి పీడించే అనారోగ్య సమస్యల్లో నులిపురుగులు ప్రధానమైనవని, పిల్లల ఎదుగుదలను శాసిస్తాయని అన్నారు. ఆల్బెండజోల్ మాత్రలను ముందస్తుగా వేసుకుంటే పిల్లలకు ఆరోగ్య సమస్యలు ఉండవని అన్నారు. పిల్లలందరరూ తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలను తీసుకోవాలన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కేసా రవి, వైద్యులు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ నిపుణ్, సీహెచ్‌వోలు వెంకయ్య, ప్రభాకర్, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, జ్యోతి, సరస్వతి, రాణి, జరీనా పాల్గొన్నారు.

● దేవరకొండ మండలంలోని తూర్పుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆల్బెండజోల్ టాబ్లెట్లను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కృష్ణకుమారి మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్లగాజు జాన్‌యాదవ్, జడ్పీటీసీ మారేపాకల అరుణసురేష్‌గౌడ్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయ, దయానంద్, వెంకటయ్య, రాంసింగ్, హరికృష్ణ, భీముడు పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) మండలంలోని శీత్లతండా, నేతాపురం గ్రామాల్లోని పాఠశాలల్లోని విద్యార్థులకు ఎంఎల్‌హెచ్‌పీ ఆర్.మౌనిక ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కె.సరిత, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆశాలు ఉన్నారు.

● శాలిగౌరారం జడ్పీ హైస్కూల్‌లో మండల వైద్యాధికారిణి ఏకె.సూర్యశిల్ప మాత్రలు పంపిణీ చేశారు. పిల్లలకు సోకే వ్యాధుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జోగు సైదమ్మ శ్రీనివాస్, వైద్య సిబ్బంది వెంకటేశం, రాములమ్మ, భాస్కర్, అంగన్‌వాడీ టీచర్ సంధ్య, ఆశా వర్కర్ గుణపతి పాల్గొన్నారు.

● చింతపల్లి, మాల్ కేంద్రాలలోని జడ్పీ, ప్రాథమిక స్కూళ్లలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ కంకణాల ప్రవీణవెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండూరు భవాని, వంశీ, శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కేతేపల్లిలో జడ్పీ ఉన్నతపాఠశాలలో ఎంపీపీ పి.శేఖర్ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అర్చన కొండ్ర, పాఠశాల హెచ్‌ఎం వై.నర్సిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు సుందర్‌నాయక్, జగదీశ్వర్‌రెడ్డి, కమలమ్మ, టీచర్లు బుచ్చిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● మునుగోడులో ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు డాక్టర్ నర్మద, మాధురి, హెచ్‌ఎం భిక్షంగౌడ్, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్ హిల్‌కాలనీ, పైలాన్ కాలనీల్లో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆరోగ్యశాఖ సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది లింగయ్య, తిరుమలాచారి, సావిత్రమ్మ, మంగాదేవి, హరాస్సేన్‌బీ, మల్లిక, హసీనా, స్నేహలత పాల్గొన్నారు.


దేవరకొండ: తూర్పుపల్లిలో మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

● చండూరు పట్టణంలోని సన్‌షైన్ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న, హెచ్‌వీ వెంకట్‌రమణ, ఏఎన్‌ఎంలు మహబూబీ, మంగమ్మ, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

● తిప్పర్తి మండల కేంద్రంలో ఎంపీపీ విజయలక్ష్మి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, మోడల్ పాఠశాలతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెడికల్ ఆఫీసర్ ఎజాజ్ ఇష్తియార్‌తో మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది శేషాదేవి, ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరులో ఎంపీపీ ముత్తి లింగం మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్వేత, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● మర్రిగూడలో జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, ఎంపీపీ గండికోట రాజమణిహరికృష్ణ పలు పాఠశాలల్లో నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో గురువారావు, వైద్య అధికారులు, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

రాజకీయ అజాతశత్రువు జానారెడ్డి


హాలియాలో ఎంపీ రఘువీర్‌కు కేక్ తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ, జూన్ 20: రాజకీయాల్లో సుదీర్ఘకాలం కొనసాగుతూ అందరివాడుగా, అజాతశత్రువుగా సీఎల్పీ మాజీనేత కుందూరు జానారెడ్డి పేరుగాంచారని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మాజీమంత్రి సీనియర్‌నేత జానారెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఎంపీ క్యాంపు కార్యాలయం, స్థానిక పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జానారెడ్డి తొమ్మిది శాఖల మంత్రిగా జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారని అన్నారు. సాగర్‌కాల్వ నీళ్ల పారని టేలాండ్ భూములకు సాగునీరందించిన ఘనత జానారెడ్డికి దక్కిందన్నారు. కెప్టెన్‌గా దేశరక్షణలో పాలుపంచుకొని తిరిగి రాజకీయాలతో ప్రజాసేవను కొనసాగిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రిగా జిల్లాకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిరుమరి కృష్ణయ్య, పగడి రామలింగయ్య, షైబెల్లి, పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, తలకొప్పుల సైదులు, పొదిళ్ల శ్రీనివాస్, సలీం, ముదిరెడ్డి నర్సిరెడ్డి, ఆరీఫ్, మాలి కాంతారెడ్డి, బసవయ్య, పొదిల వెంకన్న, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జానా పుట్టినరోజు వేడుకలు

హాలియా: సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి జన్మదిన వేడుకలను హాలియా సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి కేక్ కట్ చేసి కార్యకర్తలు, అభిమానులకు పంచారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షులు కుందూరు వెంకట్‌రెడ్డి, నాయకులు కాకునూరి నారాయణగౌడ్, తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, వెంపటి శ్రీనివాస్, అబ్బిడి కృష్ణారెడ్డి, నందికొండ రామేశ్వరీమట్టారెడ్డి, మాలే అరుణ,మిట్టపల్లి వాసు, గౌని రాజారమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


జానారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మిట్టపల్లి వెంకటేష్, శివారెడ్డి


జానారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న చిట్టిప్రోలు యాదగిరి

జానాకు శుభాకాంక్షల వెల్లువ: సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి జన్మదినం సందర్భంగా హాలియాకు చెందిన పలువురు హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనతో భారీ కేక్‌ను కట్ చేయించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మునిసిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి, మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, రామాలయం చైర్మన్ మేడేపల్లి మోహన్‌రావు, మలిగిరెడ్డి రామాంజిరెడ్డి, చెరుకూరి కిరణ్, రిక్కల సుధాకర్‌రెడ్డి, సాగర్ రాంబాబు, రామకృష్ణరెడ్డి, రావుల శ్రీనివాస్, వేణు, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

జానాకు శుభాకాంక్షలు తెలిపిన వెంకటేష్

మిర్యాలగూడ టౌన్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మిట్టపల్లి వెంకటేష్ శుభాకాంక్షలు తెలిపారు. పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర రాజధానిలో జానారెడ్డిని కలిసిన వెంకటేష్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘకాలంగా ప్రజలకు సేవలందిస్తున్న జానా మరెన్నో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

సంక్షిప్త సమాచారం...

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 22వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి మండలస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు సమగ్ర సమాచారంతో సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

మిర్యాలగూడ టౌన్: ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ బీసీ, ఎస్సీ విద్యార్థి సంఘాల నాయకులు డీఈవో భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. బీసీ, మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ పగిడి జీడయ్యయాదవ్, సురేష్ మాట్లాడుతూ పట్టణంలో అధిక ఫీజులు వసూలుచేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టాభిదాసు ఆశయ సాధనకు కృషి చేయాలని తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ధర్మోరి వెంకటేశ్వర్లు అన్నారు. రంగస్థల సీనియర్ నటుడు, నంది, గరుడ, హనుమ తదితర అవార్డుల గ్రహీత పోతుత్తూరి చిన్న పట్టాభిదాసు సంతాపసభకు ఆయన హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చింతపల్లి: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని జడ్పీటీసీ కంకణాల ప్రవీణ, ఎంపీపీ కొండూరు భవాని అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అదించాలని అన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలోని పెండ్లిపాక అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిప్పర్తి రాధ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు.

మిర్యాలగూడ అర్బన్: విశ్వబ్రాహ్మణ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న వధూవరుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమ కరపత్రాన్ని ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సంక్షేమభవనంలో జరిగే కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణులు అధికసంఖ్యలో పాల్గొని వివాహ పరిచయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగార్జునచారి కోరారు.

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ జిల్లా సాధన కోసం ఏడాదికాలం పాటు సాగించిన ఉద్యమాన్ని ప్రభుత్వం గుర్తించి పరిపాలన సౌలభ్యత కోసం మిర్యాలగూడకు సబ్ కలెక్టర్‌ను కేటాయించిందని జిల్లా సాధనసమితి స్టీరింగ్ కమిటీ నాయకులు మాలోతు దశరథనాయక్, మారం శ్రీనివాస్, మాడ్గుల శ్రీనివాస్ అన్నారు. సబ్ కలెక్టర్‌ను కేటాయించడంపై స్థానిక అమరవీరుల స్థూపం వద్ద హర్షం వ్యక్తం చేశారు.

చండూరు: చండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎంపికైన డీలర్లకు ఆర్డీవో సుబ్రహ్మణ్యం ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. నాంపల్లి, మర్రిగూడ, చండూరు, గట్టుప్పల, మునుగోడు మండలాల్లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల నియమాకానికి రాత పరీక్ష నిర్వహించారు. ఐదు మండలాల్లో మొత్తం 21మంది రేషన్ డీలర్లుగా ఎంపిక కాగా, 20 మందికే నియామక పత్రాలను అందజేశారు. మర్రిగూడ మండలం ఖుదాబాక్షుపల్లి చెందిన రేషన్ దుకాణం ఎంపిక విషయంలో అభ్యంతరాలతో పాటు, కోర్టు కేసులో ఉన్నందున వాయిదా వేసినట్లు ఆర్డీవో వెల్లడించారు.

పెద్దవూర: ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంకణాల నివేదితరెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా ఇప్పటివరకు ఏ ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, నిరుద్యోగులకు, మహిళలకు భృతి, పించన్ల పెంపు అనేక హామీలు ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పీఎం మోదీ పరిష్కరిస్తున్నారని అన్నారు.

కనగల్, పెద్దఅడిశర్లపల్లి, చండూరు: నెంబర్ ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా తిరిగితే కేసులు తప్పవని ఎస్‌ఐలు హెచ్చరించారు. చైన్ స్నాచింగ్, దొంగతనాలను నివారించటంలో వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. వాహనదారులు సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లను తప్పక కలిగి ఉండాలని సూచించారు.

కనగల్‌లో నెంబర్ ప్లేట్లు లేని 15 వాహనాలను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణగౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీలు స్వామి, వెంకట్‌రెడ్డి, రమేష్, బుర్హాన్ తదితరులు పాల్గొన్నారు.

● నెంబర్ ప్లేట్ పూర్తిగా లేని, సక్రమంగా లేని 6 ద్విచక్ర వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు. వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా తిరిగితే కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

● సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా రోడ్డుపై వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని చండూరు సీఐ వెంకటయ్య హెచ్చరించారు. పట్టణంలో ఎస్‌ఐ సురేష్‌తో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీలో పట్టుబడిన వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

మిర్యాలగూడ టౌన్: ఆరోగ్యమే మహాభాగ్యమని ఎంఈవో బాలాజీనాయక్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఢిల్లీ వరల్డ్ స్కూల్ ఆధ్వర్యంలో యోగా ప్రదర్శన చేశారు. క్లియో స్పోర్ట్స్ అకాడమీ, ఫైర్ స్టేషన్, వెట్రోస్ సినీప్లెక్స్, మినా కళాశాలలలో పాఠశాల విద్యార్థులు అద్భుతమైన యోగా సాధన ప్రదర్శన నిర్వహించారు.

మిర్యాలగూడ టౌన్: 'నీట్'ను నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.షోయబ్ అన్నారు. పట్టణంలో బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా షోయబ్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన నీట్ పరీక్షను రద్దు చేసి మరో ఎంట్రెన్స్ టెస్ట్ వెంటనే పకడ్బందీగా నిర్వహించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేష్‌నాయుడు, శ్రీకాంత్, శోభన్‌బాబు, ఓంకార్, సుభాని, తేజ, శ్రవణ్ పాల్గొన్నారు.

● ఎస్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపావత్ హరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఆరిఫ్ మాట్లాడుతూ నీట్ పరీక్షలో అవకతవకలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.